



నేటి దినపత్రిక **సూర్య**

www.suryaa.com

**ఆదిలాబాద్**

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

బుధవారం / 07 మే / 2025 / పేజీ 07


# త్రాగునీటికి సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలి



◆ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**అదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి సూర్య మేజర్ న్యూస్ :** జిల్లాలో ఉత్పన్నమయ్యే త్రాగునీటి సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మిషన్ భగీరథ ఇంజనీర్లు, జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లాలో త్రాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్రాగునీటి సమస్యలపై దినపత్రికలలో, ప్రసార సాధనాలలో వచ్చిన కథనాలపై అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, చేపట్టిన చర్యల సమాచారాన్ని జిల్లా పౌర సంబంధాల అధికారి ద్వారా పత్రికలలో వచ్చే విధంగా చూడాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రతి మండలంలో బుధవారం రోజున మిషన్ భగీరథ ఇంజనీర్లు, పంచాయితీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో త్రాగునీటిపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమీక్ష నిర్వహించాలని తెలిపారు. త్రాగునీటి సమస్యలపై ప్రతిరోజు దినపత్రికలలో వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, జిల్లాలోని 147 హాబిటేషన్ లలోని త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయంగా నీటి టాంకర్ల ద్వారా, గుర్తించబడిన బోర్ వెల్స్ ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ మోటార్లు, పైపు లైన్ల లీకేజీ మరమ్మత్తులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, గ్రామాలు, మున్సిపాలిటీలలో నీటిని వృధా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. త్రాగునీటిపై ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని, పంచాయతీ కార్యదర్శి తన పరిధిలో ప్రతి త్రాగునీటి వనరును సందర్శించి సమస్యలను గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని, ప్రతి రోజు గ్రామాలకు గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న వివరాలు ప్రతిరోజు అందించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ ప్రత్యేక అధికారులు గ్రామాలలో త్రాగునీటిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్ కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, మిషన్ భగీరథ ఈ. ఈ. సిద్ధిఖి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ ద్వారా నిరంతర నీటి సరఫరాకు చర్యలు

◆ మిషన్ భగీరథ ఈ ఈ

**అదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి సూర్య మేజర్ న్యూస్ :** జిల్లాలో మిషన్ భగీరథ పథకంలో నల్ల కనెక్షన్ ద్వారా ప్రతి ఇంటికి నిరంతర నీటి సరఫరా కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మిషన్ భగీరథ ఈ ఈ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెజ్జూర్ మండలం బెజ్జూరు గ్రామపంచాయతీ పరిధిలోని బెస్తవాడ, ఎస్.సి. కాలనీలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ సమస్యపై మండల పరిషత్ అభివృద్ధి అధికారితో కలిసి పర్యవేక్షించారు. ప్రజలకు త్రాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలైన చేతిపంపులు,



నీటి బావులకు మరమ్మత్తులు నిర్వహించి వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నీటి సరఫరా కు ఎలాంటి అవకాశం లేని ప్రాంతాలకు నీటి టాంకర్ల ద్వారా త్రాగునీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

## పెంచికల్ పేట మండలంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ

◆ కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా



**అదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి సూర్య మేజర్ న్యూస్ :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ ఓ ఆర్ చట్టం తమలలో భాగంగా జిల్లాలోని పెంచికల్ పేట మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించడం జరిగిందని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు దర్గోపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జనకాపూర్ గ్రామానికి దర్గోపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం, చెడ్వాయి గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదిక, అగర్ గూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో, 8, 9, 12 తేదీలలో పోతేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పోతేపల్లి, గుంట్ల పెట్ గ్రామాలకు సంబంధించి పోతేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం, లోడ్పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం, మురళిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని మురళిగూడ, జిల్లెడ, తెల్లపల్లి గ్రామాలకు సంబంధించి మురళిగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో, 13, 14, 15 తేదీలలో బొంబాయిగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో, ఎల్కపల్లి గ్రామపంచాయతీలోని ఎల్కపల్లి గ్రామానికి సంబంధించి పెంచికల్పేట రైతు వేదికలో, కమ్మర్గాం గ్రామపంచాయతీ పరిధిలోని నందిగాం, కమ్మర్గాం, గుండెపల్లి గ్రామాలకు సంబంధించి కమ్మర్గాం రైతువేదికలో, 16, 17, 19 తేదీలలో ఎల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో, కొండపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో, పంచికల్ పేట గ్రామపంచాయతీ పరిధిలోని పెంచికల్ పేట, కోయచిచాల, గన్నారం గ్రామాలకు పెంచికల్ పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆయా తేదీలలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు నిర్ణీత తేదీలలో సకాలంలో భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని, భూభారతి చట్టం ప్రకారం పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో నూతన బార్

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి సూర్య మేజర్ న్యూస్ :** జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో గతంలో మూతబడిన బార్ స్థానంలో నూతన బార్ ఏర్పాటుకు నిర్వహించిన డ్రా పద్దతిలో ఎంపికైన లబ్దిదారుడికి అనుమతి జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఆబ్కారీ శాఖ పర్యవేక్షకుడు నందగోపాల్, ఎక్సైజ్ సి.ఐ. గురువయ్యలతో కలిసి డ్రా పద్దతిలో లబ్దిదారుడిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో గతంలో మూతబడిన బార్ స్థానంలో నూతన బార్ ఏర్పాటుకు నిర్వహించిన డ్రాలో గంద్ర దీక్షిత్అవు లబ్దిదారుడిగా ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.



## సారంగాపూర్ ఎస్సై కి రాష్ట్రస్థాయి అవార్డు



**సారంగాపూర్,ఏప్రిల్7,సూర్య మేజర్ న్యూస్ :** మండల ఎస్సై సల్ల శ్రీకాంత్ తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్ 2025 జీ తెలుగు రాష్ట్రస్థాయి ఉత్తమ ఎస్ఐ అవార్డు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సోమవారం రోజు అందుకున్నారు. మండలంలోని మహబూబ్ ఘాట్ వద్ద గత సంవత్సరం అర్ధరాత్రి ఒక కారు అదుపు తప్పి లోయలో బోల్తాపడగా సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొన్నారు,విధి నిర్వహణ లో చేసిన సేవలకు గుర్తింపుగా రాష్ట్రస్థాయి అవార్డు ఆయనను వరించింది.రాష్ట్ర స్థాయి లో ఉత్తమ పోలీస్ అవార్డు సాధించడం తో జిల్లా ఎస్పీ జానకి షర్మిళ తోపాటు పలువురు ఉన్నత అధికారులు సారంగాపూర్ ఎస్ఐ సల్ల శ్రీకాంత్ ను అభినందించారు.

## విజయవంతంగా ముగిసిన ఉచిత పాలిసెట్ శిక్షణ శిబిరం





**కాగజ్‌నగర్, మే 6, సూర్య మేజర్ న్యూస్:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ రిసోర్స్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత పాలిసెట్ కోచింగ్ శిబిరం మంగళవారం విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి హాజరయ్యారు. ప్రారంభంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, ఈ శిక్షణ శిబిరం తమకు ప్రతిభను పదిలం చేసి, వివిధ ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యేలా చేయడంలో ఎంతో దోహదపడిందని తెలిపారు. ముఖ్య అతిథి శ్రీదేవి మాట్లాడుతూ, సమాజంలో అసమానతలు తగ్గడానికి విద్యే అత్యుత్తమ ఆయుధమని పేర్కొన్నారు. జిల్లాలో పేద విద్యార్థులు అధికంగా ఉన్న నేపథ్యంలో ఇటువంటి శిబిరాలు వారికి ఉన్నత విద్యలో అవకాశాలను అందించడానికి ఉపయోగపడతాయని చెప్పారు. విశిష్ట అతిథి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ అధ్యాపకులు రామదాసు మాట్లాడుతూ, సాంకేతిక విద్య ద్వారా యువత ఉద్యోగ అవకాశాలను సులభంగా పొందగలరని అభిప్రాయపడ్డారు. మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ ప్రతిరోజూ క్రమశిక్షణతో హాజరైన విద్యార్థులను అభినందించారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కోఆర్డినేటర్ మరియు జిల్లా సైన్స్ అధికారి మధుకర్ మాట్లాడుతూ, ఈ శిక్షణ శిబిరం గత నాలుగేళ్లుగా ఉపాధ్యాయుల సహకారంతో విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. జిల్లా విద్యాశాఖ, జిల్లా పాలన యంత్రాంగం అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ప్రవేశ పరీక్షల్లో ప్రతిభను కనబెట్టి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయులు చిలుకూరు సత్యనారాయణ, తాటి రవీందర్, పర్స చంద్రశేఖర్, ఉపాధ్యాయులు దుర్గం మోహన్, సాబీర్, మామిడాల తిరుపతయ్య, మామిడాల శ్రీశైలం, ధౌటం శ్యాం సుందర్, కే త్రివేణి, శాంతి కుమార్, వెంకటరమణ, డి రవి, శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## యూజీసీ నెట్ లో మెరిసి ప్రభుత్వ కొలువు సంపాదించిన నిర్మల్ జిల్లా విద్యార్థిని



**సారంగాపూర్,ఏప్రిల్ 7,సూర్య మేజర్ న్యూస్ :** ఇటీవల విడుదలైన యుజిసి నెట్ ఫలితాలలో సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన కాప్లాయి శ్రావిక జాతీయస్థాయిలో 42 వ ర్యాంకు సాధించి ఔరా అనిపించింది. జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సంపాదించడంతో అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలువుకు ఎంపికైంది.దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన శ్రావిక విద్యాభ్యాసం అంతా కూడా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చేయడం కోసమెరుపు, ఒకటవ తరగతి నుండి 10 వ తరగతి



వరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంది. ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ సారంగాపూర్‌లో పూర్తిచేసింది. డిగ్రీ నిర్మల్‌లోని ప్రభుత్వ రెసిడెన్సియల్ డిగ్రీకళాశాలలో చదివింది.పీజీ తెలంగాణ యూనివర్సిటీ సౌత్ సెంట్రల్ క్యాంపస్ బిక్నూర్ లో ఆర్గానిక్ కెమికల్ విభాగంలో 92 శాతం మార్కులతో పాస్ అయ్యింది.తల్లిదండ్రులు శోభ మోహన్ ల ప్రోత్సాహం అన్నయ్య శ్రవణ్ కుమార్, అక్క స్రవంతిల ప్రోద్భలంతో ఈ కొలువు సంపాదించానని,చిన్నప్పటినుండి కుటుంబ కష్టాలను దగ్గరగా చూసి ఏదైనా సాధించాలనే పట్టుదలతో ప్రైవేట్ విద్యా సంస్థలలో చదివితే తల్లిదండ్రులకు భారంగా మారుతుందని తన విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ విద్యాసంస్థలలోన చేశానని,కొలువును సాధించేందుకు అవసరమైన విషయాలను ఆన్లైన్లో చదువుకున్నానని శ్రావిక తెలిపారు.మొదటి ప్రయత్నంలో ఉద్యోగం తృటిలో చేజారిన సమయంలో తల్లిదండ్రులు వెన్నంటె నిలిచి ధైర్యం అందించారని,తొలి ప్రయత్నంలో చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకొని అహర్నిశలు కష్టపడ్డానని తనకు ఇష్టమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలువును సాధించానని శ్రావిక తెలిపారు.జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సంపాదించి జిల్లాకే గర్వకారణంగా నిలిచి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం సాధించిన శ్రావికను పలువురు అభినందించారు.

## నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ షురూ

### హర్షం వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు

- మే నెలాఖరులోగా లేదా జూన్ మొదటి వారంలో సన్న బియ్యం అందించేందుకు అధికారులు సన్నద్ధం
- దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న మండల రెవెన్యూ అధికారులు
- ఏప్రిల్ నెలలో వెరిఫికేషన్ పూర్తయిన వారికి రేషన్ కార్డు నెంబర్ ను అలర్ట్ చేసిన అధికారులు




**సారంగాపూర్,ఏప్రిల్ 7,సూర్య మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు.మీసేవ ద్వారా మరియు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్లి పరిశీలన చేసి అర్హులైన వారికి రేషన్ కార్డులను అందించేందుకు అధికారులు సన్నద్ధం చేస్తున్నారు.మండల రెవెన్యూ అధికారులు దరఖాస్తుదారుల అర్హతను తేల్చేందుకు భూమి యొక్క వివరాలను వాహనాల యొక్క వివరాలను సొంత ఇల్లు కలిగి ఉన్నాడా లేదా కరెంట్ మీటర్ వివరాలను కుటుంబ సభ్యుల మొత్తం



వార్షిక ఆదాయం కుటుంబంలో ఎవరికైనా ఉద్యోగం ఉందా తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.ఏప్రిల్ నెలలో వెరిఫికేషన్ పూర్తయిన చాలామంది లబ్ధిదారులకు రేషన్ కార్డు నెంబర్ ను పౌరసరఫరాల అధికారులు జారీ చేశారు.రేషన్ కార్డు నెంబర్ జారీ అయిన లబ్దిదారులకు ఈ నెలాఖరులోగా లేదా జూన్ మొదటి వారంలో సన్న బియ్యం అందించేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు.దాదాపు దశాబ్ద కాలంగా కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ లేకపోవడంతో ప్రస్తుతం రేషన్ కార్డు మంజూరవడంతో లబ్దిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి ఎస్సై




**బేల, మే 6, సూర్య మేజర్ న్యూస్ :** బేల మండల ఎస్సైగా నాగ్ నాథ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం మండలంలోని పలు పార్టీల నాయకులు, యువజన సంఘాలు, పాత్రికేయులు నూతన ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని, అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఏదైనా సమస్యలు ఉన్న 100కి డయల్ చేయాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

# 17వ జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

**మంచిర్యాల క్రైమ్ సూర్యా మేజర్ న్యూస్ :**
అఖిల భారతీయ యువజన సమాఖ్య ఈ నెల 15వ తేదీ నుండి 18 వరకు తిరుపతిలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ 17 జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లింగం రవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మహాసభల గోడ ప్రతులను విడుదల చేసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్య వైద్య ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి 65 లక్షల 25 వేల అప్లికేషన్లు రాగా సిబిల్ స్కోర్ తప్పనిసరి అని నిబంధన పెట్టి 40 శాతం అప్లికేషన్లను రద్దు చేశారనారు. దేశంలో రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న బిజెపి ప్రభుత్వం దేశభక్తి అనే ముసుగులో యువతను పక్కదారి పట్టిస్తుందన్నారు. ఈ 17వ మహాసభలో భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ అమలు చేయాలని ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని దేశవ్యాప్తంగా ప్రైవేట్



రంగాలలో రిజర్వేషన్ కల్పించాలని 2020 నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని విద్య వైద్య ఉపాధి అవకాశాలు కల్పించాలని పలు తీర్మానాలు చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు మామిడాల సత్యం, కార్యవర్గ సభ్యులు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచింగ్ కు పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్ట్

**నిర్మల్ మే 6, సూర్య మేజర్ న్యూస్ :**
మోటార్ సైకిల్ పై వెళ్తున్న దంపతులను అడ్డగించి, బాధితుని మెడలోని బంగారు చైన్ ను మరియు బాధిత మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు అపహరించిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న ఘటన మంగళవారం నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీ అవినాష్ కుమార్ భైంసా ఎ ఎస్పీ, ఐ/సి ఎస్ డి పి ఓ నిర్మల్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలిపిన వివరాల ప్రకారం గత నెల ఏప్రిల్ 30వ తేదీన రాత్రి ఇద్దరు దంపతులు మోటార్ సైకిల్ పై నిర్మల్ నుంచి వెంగ్వాపేట కు వెళ్తున్న క్రమంలో, కావేరి కుటీర్ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వారి మోటార్ సైకిల్ ను అడ్డగించి, బాధితుని మెడలోని బంగారు చైన్ ను మరియు బాధిత మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు అపహరించి, వెంట తెచ్చుకున్న ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. దీంతో బాధితుని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న నిర్మల్ రూరల్ పోలీసులు చైన్ స్నాచింగ్ దొంగల కోసం విస్తృతంగా గాలించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మంజులాపూర్ లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, అనుమానస్పదంగా వచ్చుచున్న ఇద్దరు వ్యక్తులు అక్కడి పోలీసులని చూసి పారి పోయే ప్రయత్నం చేయగా వారిని పోలీసులు పట్టుకొని విచారించగా వారు 1. నాందేడ్ జిల్లా సోనారి తాలూకా, పొన్నాలకు చెందిన పర్బాజీ బాలాజీ రేల్వాడ్ వయస్సు: 29 సం , మరియు 2. తల్వేద గ్రామానికి చెందిన అలిశెట్టి శ్రీనివాస్ వయస్సు: 39 సం అని తెలిసింది, పూర్తి విచారణ లో ఫిర్యాది మెడలోని బంగారు చైన్ ఇంకా మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు చోరీ చేసింది తామేనని నిందితులిద్దరూ అంగీకరించారు. వారి వద్ద నుంచి రెండు




తులాల బంగారు పుస్తెలతాడు, ఒక తులం బంగారు గొలుసును స్వాధీనం చేసుకొన్నారు, ఆ ఇద్దరినీ రిమాండ్ కు తరలివడం జరుగుతుంది అని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ సంతోష్, సత్యనారాయణ లను నిర్మల్ ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని నిర్మల్ పోలీసులు తెలిపారు. ఈ సమావేశం లో నిర్మల్ రూరల్ సీఐ మున్నూరు కృష్ణ, నిర్మల్ రూరల్ ఎస్సై జి.లింబద్రి మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కేసులో త్వరగా స్పందించి నిందితుల్ని పట్టుకోవటం లో ప్రతిభ చూపిన రూరల్ సీఐ మున్నూరు కృష్ణ, నిర్మల్ రూరల్ ఎస్సై జి.లింబద్రి, సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అభినందించారు.

# పద్యకవి వెంకట్‌కు దర్పణం సాహిత్య రాష్ట్ర సన్మానం

**నిర్మల్ మే 6, సూర్య మేజర్ న్యూస్ :**
నిర్మల్ కు చెందిన ప్రముఖ పద్యకవి,కవియాత్ర జాతీయ ప్రధానకార్యదర్శి డా. బి వెంకట్ దర్పణం సాహిత్య రాష్ట్ర సన్మానమును అందుకున్నారు. ఈ రోజు హైదరాబాదులోని రవీంద్రభారతి సమావేశము మందిరంలో దర్పణం సాహిత్య వేదిక, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అశ్విని ప్రచురణలు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన డా. బీదెళ్ళ సీతాలక్ష్మి ,పరిమి వెంకట సత్యమూర్తి దంపతులు రచించిన కవితాదర్పణం,హాస్యబ్రహ్మ శంకరనారాయణ రచించిన "సీతాశతకం" పుస్తకావిష్కరణ సభలలో జాతీయ స్థాయి కవి సమ్మేళనములో దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షులు డా. రాయారావు,సూర్యప్రకాశరావు,హాస్యబ్రహ్మ శంకరనారాయణ, ప్రముఖకవి,సద్విమర్శకులు దాస్యం సేనాధిపతి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి, పుస్తక సమీక్షకులు చెన్నూరి సీతారాంబాబు. ముదిగొండ సంతోష్ కుమార్ శర్మ, ప్రముఖకవులు రామకృష్ణ చంద్రమౌళి,వడ్డేపల్లి విజయలక్ష్మీల చేతుల మీదుగా దర్పణం రాష్ట్ర సాహిత్య సన్మానమును అందుకున్నారు.






# రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని సి ఐ టి యు ఆధ్వర్యంలో ధర్నా




**కాగజ్నగర్, మే 6 , సూర్య మేజర్ న్యూస్ :**
రైల్వే ప్రైవేటీకరణ ఆపాలనీ, ఎక్స్ ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలని, ప్రయాణికులకు భద్రత కల్పించాలనీ, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆల్ ఇండియా కమిటీ, ప్రజా సంఘాల పిలుపు మేరకు ఈరోజు మంగళవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ రైల్వే స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, సిఐటియు జిల్లా నాయకులు అలవల చంద్రయ్య , జిల్లా సహాయ కార్యదర్శి ఈ శంకర్ ,ఈ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## యువ వికాస్ అభ్యర్థుల దరఖాస్తు పరిశీలన



**చింతలమానేపల్లి, మే 6, సూర్యా మేజర్ న్యూస్ :**
మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాస్ పథకం అభ్యర్థుల జాబితాను పరిశీలిస్తున్న మండల ఎంపీడీవో సుధాకర్ రెడ్డి. ఈ పథకం కింద 50 వేల రూపాయల నుండి నాలుగు లక్షల వరకు మీసేవ ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను బ్యాంకు మేనేజర్ ఉన్నతాధికారులు ఆధ్వర్యంలో (సమక్షంలో) ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, రేషన్ కార్డ్, బ్యాంక్ పాస్బుక్, ఆదాయ, కుల ధ్రువీకరణ, విద్యార్హత పత్రంలను మంగళవారం పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించి స్వీకరించారు. మండలంలోని అన్ని గ్రామాల ద్వారా మొత్తం 1870 దరఖాస్తులు యువ వికాస్ కు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, అలాగే బూరెపల్లి, బాబాపూర్, కర్జవెల్లి గ్రామాల ద్వారా మొత్తం దరఖాస్తులు ఎస్ టి- 44, ఎస్సీ- 65, బి సి-156, ఈ బి సి- 2 వచ్చాయని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. దరఖాస్తుదారులు ఏదో ఒక అర్హత పత్రాలు మర్చిపోయి ఉంటే ఆ పత్రాలు రెండు రోజుల వరకు తీసుకొచ్చి ఇవ్వవలసిందిగా కోరారు.

## మృతుడి కుటుంబానికి బాల్య మిత్రుల చేయూత

**లక్షెట్టిపేట, మే 06, సూర్య మేజర్ న్యూస్ :**
మండలంలోని వెంకట్రావు పేట గ్రామానికి చెందిన మునిగంటి చంద్రశేఖర్ గత కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. మృతుడు మునిగంటి చంద్రశేఖర్ కుటుంబానికి మంగళవారం బాల్య మిత్ర బృందం(1990-91) బ్యాచ్ దొడేపల్లి పాఠశాల ఆధ్వర్యంలో రూ.50,000/- మృతుడి కూతురు జాహ్నవి పేరుతో బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి బాధిత కుటుంబానికి బాండ్ అందజేశారు. ఎంతో మందికి ఆదర్శంగా బాధిత కుటుంబానికి తోడుగా నిలుచున్న మిత్ర బృందాన్ని గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమం లో మృతుడి బాల్య స్నేహితులు పాల్గొన్నారు.